క్లుప్తంగా

ఈరన్న స్వామికి అభిషేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహా మంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



డ్రైఫ్రూట్స్ అలంకరణలో ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: పట్టణంలోని హనుమాన్ నగర్‌లో వెలిసిన శ్రీ పంచముఖి వీరాంజనేయస్వామి 30వ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో స్వామివారికి వేకువజామున పంచామృతాభిషేకం, ధ్వజారోహణం, తులసి సహస్రార్చనము, కలశ స్థాపనం, వాయుస్తుతి, నవగ్రహ పూజ, హోమం, పూర్ణాహుతి పూజలు, నైవేద్యం, మహామంగళహారతి పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిగింది. సాయంత్రం పురవీధుల్లో స్వామివారి ఉత్సవమూర్తితో రథోత్సవం నిర్వహించారు. రథం ముందు డోలు, సన్నాయి వాయిద్యాల మధ్య చిన్నారులు, మహిళలు కలశాలతో పాల్గొనగా రథోత్సవం ఆలయం చుట్టూ కొనసాగింది.

తాగునీటి సమస్య పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 32వ వార్డు సంజీవనగర్ పక్కనే ఉన్న రాఘవేంద్ర నగర్‌లో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీ వాసులు కోరారు. ఈ మేరకు సోమవారం సీపీఎం నాయకులు గోవిందు, రాముడు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు. కాలనీలో మంచినీటి సమస్య ఉన్నందున ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని వారు కోరారు. స్పందించిన కమిషనర్ సత్వర చర్యలు చేపట్టి నీటిని సరఫరా చేస్తామని కాలనీవాసులకు సూచించారు.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

ఆదోని రూరల్: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఆదోనిలో అభిమానులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక రాజశ్రీ థియేటర్‌లో అభిమాన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చాంద్‌బాషా ఆధ్వర్యంలో భారీ కేకును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ ఫ్యాన్స్ స్టేట్ వైడ్ కన్వీనర్ కె.ముజీబ్‌అహ్మద్ పాల్గొని కేకును కట్ చేశారు. అభిమానులకు పంచి పెట్టారు. మండలంలోని పెద్దహరివాణం గ్రామానికి చెందిన అభిమానులు స్థానిక ఆస్పత్రి రోడ్డులోని జీవనజ్యోతి అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. అభిమానులు వెంకటేష్, రాజు, కోసిగి నరసన్న, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఈఏపీసెట్ పరీక్ష



విద్యార్థి హాల్‌టికెట్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెంయిట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఏపీ ఈఏపీసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వీరన్న మాట్లాడుతూ.. ఏపీ ఈఏపీసెట్ పరీక్ష మరో రెండు కాలేజీల్లో జరుగుతున్నట్లు చెప్పారు. సోమవారం 400 మంది విద్యార్థులను కాలేజీకి కేటాయించగా 381 మంది పరీక్షకు హాజరయ్యారని 19 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. విద్యార్థులను క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రంలోనికి పంపారు. రూరల్ పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.

పెద్దతుంబళంలో పంట నష్టపరిహారం సొమ్ము డ్రా చేసుకునేందుకు వేచిఉన్న రైతులు



ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలపై ఆనందహేల

- రైతుల ఖాతాల్లో జమ అవుతున్న నగదు
- ఖరీఫ్ పెట్టుబడులకు ఉపయోగకరం
- నియోజకవర్గంలోని 21,933 మంది రైతులకు రూ.30,77,18,790 నగదు విడుదల
- ఉత్సాహంగా ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు

ఆదోని రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న సమయంలో ఓ వైపు వరుణుడు తొలకరి జల్లులతో రైతులను పలకరించాడు. మరోవైపు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖరీఫ్–2023కి సంబంధించిన పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ)ని విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు నిలిచిపోయిన ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలపై రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఇప్పటికే రైతన్నలు తొలకరి వర్షాలకు భూములను దుక్కిదున్నుకుని ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కావడంతో నగదు డ్రా చేసుకునేందుకు బ్యాంకుల వద్ద క్యూ కడుతున్నారు.

ఆదోని నియోజకవర్గంలో గత ఖరీఫ్ సీజన్–2023లో 49 గ్రామాలకు సంబంధించి మొత్తం 21,933 మంది రైతులకు రూ.30,77,18,790 నగదు విడుదలైంది. మొత్తం 18,496 హెక్టార్లలో వరి, ఆముదం, జొన్న, వేరుశనగ, పత్తి, కొర్ర, కంది, సజ్జ పంటలను రైతులు నష్టపోయారు. ఆ నివేదికలను వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి పంపగా, ఈనెల మార్చి నెలలో ఇన్‌పుట్ సబ్సిడీ నిధులను విడుదల చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. అయితే ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఆ నిధులు రైతుల ఖాతాల్లో జమకాకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకున్నారు. దీంతో రైతులు ప్రతిపక్ష నేత తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం హైకోర్టులో ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతర పథకాల నిధులను ఎన్నికల కోడ్‌కు ముందే విడుదల చేశామని, ఆ నిధులు జమ అయ్యేలా చూడాలని పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో పంటనష్టపరిహారం నిధులు విడుదల చేయగా ఈనెల 19వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో జమవుతూ ఉన్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంట పెట్టుబడులకు ఉపయోగించుకుంటా



పంట నష్టపరిహారం కింద ప్రభుత్వం నా ఖాతాలో రూ.16 వేలు జమ చేసింది. ఆ డబ్బులను ఖరీఫ్ పంటల సాగుకు పెట్టుబడులకు ఉపయోగించుకుంటాను. ఏటా పంటల సాగుకు పెట్టుబడుల కోసం అప్పు చేయాల్సి వచ్చేది. ప్రభుత్వం విడుదల చేసిన పంట నష్టపరిహారం డబ్బులు ఎంతో ఉపయోగ పడనున్నాయి. ప్రస్తుతం వర్షాలు కూడా కురిశాయి. పొలాన్ని దుక్కి దున్నుకున్నాను. పత్తి పంటను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నా. – ఈరన్న, పెద్దతుంబళం రైతు

21,933 మందికి లబ్ధి



ఖరీఫ్ సీజన్–2023కు సంబంధించి ప్రభుత్వం 21,933 మంది రైతుల ఖాతాల్లో రూ.30,77,18,790 నగదు జమ చేసింది. ఇప్పటికే రైతులు బ్యాంకుల వద్దకు వెళ్లి డబ్బులు జమ అయ్యాయో లేదో చెక్ చేసుకుంటున్నారు. ఇంకా జమ కాని రైతులకు ఒకటి, రెండు రోజుల్లో డబ్బులు జమ అవుతాయి. ఆందోళన చెందవద్దు. గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలకు ప్రభుత్వం సబ్సిడీ కింద వేరుశనగ కాయలను అందించేందుకు చర్యలు చేపట్టింది. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

– అశోక్‌కుమార్‌రెడ్డి, ఆదోని మండల వ్యవసాయాధికారి

గ్రామం	రైతులు	పంట నష్టం (హెక్టార్లలో)	మంజూరైన నిధులు (రూ.)
ఆదోని	59	54.63	921655
ఆరేకల్	348	311.96	5085735
బలాదూర్	300	281.39	4766630
బల్లేకల్	634	425.01	7051675
బసాపురం	376	331.8	5632695
బసరకోడు	375	300.32	4938315
బైచిగేరి	642	483.05	6862515
చాగి	222	194.8	3278880
చిన్నహరివాణం	379	272.23	4624760
చిన్నగోనేహాల్	156	108.85	1843590
చిన్నపెండేకల్	1020	912.77	14802945
దెయ్యలగూడెం	345	321.94	5472980
ధణాపురం	463	343.86	5614760
దిబ్బనకల్	274	240.92	4009255
దొడ్డనకేరి	543	423.58	7037150
జి.హొసళ్లి	206	202.11	3426095
గణేకల్	398	297.12	5015280
గోనబావి	349	255.61	4017165
హాన్వాల్	860	638.8	10835480
హావ్వనూరు	214	177.16	2818595
ఇస్వీ	592	481.14	7961225
జాలిమంచి	373	302.14	4994210
కడితోట	198	175.18	2969645
కల్లుబావి	508	483.29	8192900
కపటి	822	615.47	10007420
కుప్పగల్	409	319.59	5218195
మదిరె–2	956	989.05	16804415
మదిరె–1	507	546.47	9276305
మాంత్రికి	486	425.41	7129120
నాగనాథనహళ్లి	1037	889.38	15109560
నారాయణపురం	97	77.5	1295995
నెట్టేకల్	225	199.58	3319930
పాండవగల్	516	374.21	6323065
పర్వతాపురం	234	184.03	3083720
పెద్దహరివాణం	1932	1746.66	29536445
పెద్దతుంబళం–01	525	419.83	7054660
పెసలబండ	384	269.49	4314335
ఎస్.కొండాపురం	88	73.47	1001165
సలకలకొండ	356	299.61	4954120
సాంబగల్	339	314.49	5304000
సంతెకూడ్లూరు	1035	872	14808915
సుల్తానాపురం	13	9.07	154190
వి.కొండాపురం	40	35.56	604520
వెంగలాపురం	4	0.84	13940
విరుపాపురం	690	623.74	10331720
ఎడవల్లి	98	78.47	1333990
మొత్తం	21,933	18,496.9	30,77,18,790

పరిహారంతో రెట్టింపు సంతోషం

- మంత్రాలయం నియోజకవర్గంలో 57,541 మంది రైతులకు రూ.74.08 కోట్లు విడుదల
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

కోసిగి: గతేడాది ప్రకృతి కన్నెర్ర చేసి పంటలు సాగు చేసిన అన్నదాతలకు తీవ్ర నష్టాలు మిగిల్చింది. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వర్షాలు లేని చోట కరువు మండలాలుగా ప్రకటించి ఆర్థికంగా ఆదుకునేందుకు ఉచిత పంటల బీమా నమోదు చేయించింది. నష్టపోయిన రైతులకు పరిహారం మంజూరు చేయగా రెండు రోజుల నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమవుతోంది. దీంతో రైతులు నగదు తీసుకునేందుకు బ్యాంకుల వద్ద క్యూ కట్టారు. రైతన్నలతో కోసిగి మండలంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ సీఎస్‌పీ కేంద్రాలు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, కెనరా బ్యాంక్‌లు కిక్కిరిసిపోయాయి. మంత్రాలయం నియోజకవర్గంలో 57,541 మంది రైతులకు రూ.74.08 కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో మంత్రాలయం మండలంలో 11,755 మందికి రూ.14.44 కోట్లు, పెద్దకడబూరు మండలంలో 15,674 మంది రైతులకు 16.34 కోట్లు, కోసిగి మండలంలో 12,230 మంది రైతులకు రూ.15.84 కోట్లు, కౌతాళం మండలంలో 17,882 మంది రైతులకు రూ.27.45 కోట్లు నగదు విడుదలైందని వెల్లడించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో సరైనా సమయంలో పంట బీమా నగదు రైతుల ఖాతాల్లో జమ కావడంతో పంటల సాగుకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో గుమిగూడిన రైతులు

బీమా సొమ్ము ఆదుకుంటోంది



నాకు 2.07 ఎకరాల పొలం ఉంది. గతేడాది పత్తి పంటను సాగుచేయగా వర్షాలు లేక పంట చేతికి రాకుండా పోయింది. రైతులను ఎవరు పట్టించుకుంటారు అనుకున్నాను. కానీ ప్రభుత్వం అండగా నిలిచింది. పంట పరిహారం కింద రూ.14 వేలు నా బ్యాంక్ ఖాతాలో జమ చేసింది. గతంలో పంట దెబ్బతింటే రైతును ఎవరూ ఆదుకునే వారు కాదు. ముఖ్యమంత్రి జగనన్న రైతులకు ఎంతో మేలు చేస్తున్నారు. పరిహారం అందడం చాలా ఆనందంగా ఉంది.

– మజ్జిగ పెద్ద నరసప్ప, ఆర్లబండ

అర్హులందరికీ పంట నష్టపరిహారం



గత ఖరీఫ్‌లో వర్షాలు లేక పంటలు నష్టపోయిన రైతుల ఖాతాల్లోకి నేరుగా నగదు జమఅవుతోంది. కొందరికి ఇంకా నగదు జమ కాలేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గత ఖరీఫ్‌లో మిరప, ఉల్లి పంటలకు తప్పా మిగతా అన్ని పంటలకు బీమా వర్తింపజేశారు. వారం రోజుల్లోగా అందరికీ సాయం అందుతుంది. ఖాతాలు తప్పులు ఉంటే ఆర్బీకేలకు వెళ్లి సరిచేసుకోవచ్చు.

– రాజు, ఏఓ, కోసిగి

ఇస్వీ గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు

- 10 మంది డిశ్చార్జి
- నిలకడగానే బాధితుల ఆరోగ్యం : డిప్యూటీ డీఎంహెచ్‌ఓ



పెద్దతుంబళంలో పర్యటిస్తున్న జిల్లా వైద్యాధికారులు

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ గ్రామంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఇటీవల గ్రామంలో కలుషిత నీరు తాగి ప్రజలు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల్లో చేరిన విషయం విదితమే. ఈ మేరకు సోమవారం గ్రామంలో జిల్లా వైద్యాధికారులు, జిల్లా సర్వేలైన్స్ ఆఫీసర్ వేణుగోపాల్, జిల్లా ఎపిడెమిక్ సెల్ ఆఫీసర్ చలపతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతిదేవి పెద్దతుంబళం గ్రామంలో పర్యటించారు. ఈ మేరకు పెద్దతుంబళం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలను పరీక్షించి మందులను సరఫరా చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో తిరిగి పారిశుద్ధ్యం లోపించిన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కలుషిత నీరు తాగి 16 మంది అస్వస్థతకు గురయ్యారన్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్యస్థితి నిలకడగానే ఉందన్నారు. అందులో 10 మంది డిశ్చార్జి అయినట్లు చెప్పారు. మిగతా ఆరుగురు త్వరలోనే డిశ్చార్జి అవుతారని చెప్పారు. ప్రజలు భయభ్రాంతులకు గురికావొద్దని, నీటిని వడబోసి కాచి చల్లార్చి తాగాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ ఇమ్రాన్‌అహ్మద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఈఓపీఆర్డీ, ఎంపీహెచ్‌ఈఓ, ఎంపీహెచ్‌ఎస్, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు



ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుంటున్న శానిటరీ సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని హోటళ్లు, దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని శివ సర్కిల్, ఎద్దుల మార్కెట్ వైపు ఉన్న హోటళ్లు, రెస్టారెంట్లలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకొని ఆయా రెస్టారెంట్ల యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. ప్లాస్టిక్ వినియోగంతో నష్టాలెక్కువ అని, ప్లాస్టిక్ క్యాన్సర్‌కు కారకమవుతుందని, అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని శానిటరీ సెక్రటరీలు హెచ్చరించారు. ప్లాస్టిక్‌తో వాతావరణ కాలుష్యంతో పాటు నేల సారవంతం తగ్గిపోతుందన్నారు. ఇక మీదట నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించడమే కాకుండా లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.



నాలుకకు ఇనుప చువ్వను గుచ్చుకుంటున్న పకీరు

ఘనంగా పకీర్ల ఉత్సవం



దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగస్వామి ఉరుసు వేడుకల్లో భాగంగా సోమవారం సాయంత్రం పకీర్ల ఊరేగింపు వైభవంగా సాగింది. గంధం రోజు సాయంత్రం పకీర్లందరూ పీర్లకట్ట వద్దకు చేరుతారు. వారిని దర్గా ధర్మకర్త, వారి శిష్య బృందం వెళ్లి తీసుకునిరావాలి ఇది ఇక్కడి ఆచారం. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీ వారికి స్వాగతం పలికి కార్యక్రమం నిర్వహించారు. పకీర్ల ఊరేగింపు సందర్భంగా వారు చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. స్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. పలువురు భక్తులు గంధం రోజే స్వామిని దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు జరిపారు. తెల్లవారుజామున గంధం ఉత్సవం వైభవంగా జరుగుతుందని ధర్మకర్త సయ్యద్ మున్నపాషా తెలిపారు. రాత్రి నిర్వహించిన ఖవ్వాలి పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. దర్గాలో భక్తులకు అన్నదానం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ నరేంద్రకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



పకీర్లను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం



దర్గా వద్ద పకీర్ల విన్యాసాలు

పెద్దహరివాణంలో కార్డెన్ సెర్చ్



పెద్దహరివాణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇస్వీ, పెద్దతుంబళం, రూరల్ ఎస్‌ఐలు శ్రీనివాసులు, చిన్నపీరయ్య, ఎర్రిస్వాములు, పోలీసు సిబ్బంది సోమవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో కర్ణాటక మద్యం విక్రయించే వారి ఇళ్లు, దాబాలు, గతంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా టపాసులు, పేలుడు పదార్థాలను తయారు చేసి అమ్మిన వారి ఇళ్లను, రౌడీషీటర్లు, అనుమానితుల నివాసాలను తనిఖీ చేశారు. వారందరికీ హెచ్చరికలు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో సిబ్బందితో కవాతు నిర్వహించి, ముఖ్యమైన కూడళ్లలో సమావేశం ఏర్పాటు చేసి ప్రజలతో మాట్లాడారు.. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడిన తర్వాత కూడా గ్రామంలో ఎవరూ అవాంఛనీయ ఘటనలకు పాల్పడరాదని, అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు గ్రామాల్లో రిటైల్‌గా పెట్రోల్, డీజిల్ వంటివి అమ్మరాదని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని అర్బన్: మండలంలోని ఇస్వీ గ్రామంలో తాగునీరు కలుషితం కావడానికి కారణమైన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఆదోని అసెంబ్లీ కో–కన్వీనర్ నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. తాగునీటి కాలుష్యం వల్ల అనారోగ్యానికి గురై ఆదోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇస్వీ గ్రామస్తులను సోమవారం పరామర్శించి, వారి ఆరోగ్య స్థితిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీరాములును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శుద్ధమైన నీటిని అందించడంలో ఘోరంగా విఫలమవుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దూరదృష్టితో జల్‌జీవన్ మిషన్ ప్రారంభించినప్పటికీ ప్రతి ఇంటికీ మంచినీరు అందించడంలో అధికారులు నత్తనడకన పనిచేస్తున్నారన్నారు. తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారన్నారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ముఖేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ముఖేష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్‌కుమార్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, కాశీ తదితరులు ఉన్నారు.

రౌడూరు వరకు బస్సు నడపాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కౌతాళం: మండల పరిధిలోని రౌడూరుకు ఆదోని నుంచి ఆర్టీసీ బస్సు నడపాలని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదోని ఆర్టీసీ డీపో మేనేజర్ చాలా గ్రామాలకు బస్సు సర్వీస్‌లను రద్దు చేసి ప్రైవేటు వాహనాలను (ఆటోలు, టెంపో) ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆదోని నుంచి కడితోట బదినేహాల్ మీదుగా రౌడూరు గ్రామానికి 5 సింగల్స్ బస్సు నడిచేదని, ఆ బస్సు వల్ల ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారస్తులకు అనుకూలంగా ఉండేదన్నారు. బదినేహాల్ వద్ద గతేడాది వర్షానికి బ్రిడ్జి పడిపోవడంతో బస్సును రద్దు చేశారని, తర్వాత బ్రిడ్జి నిర్మాణం పూర్తయి పది నెలలు గడచినా బస్సు సర్వీసును పునరుద్ధరించక పోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారని వాపోయారు. ఇకనైన బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. 3 సింగల్స్ కడితోట, బదినేహాల్ మీదుగా 2 సింగల్స్ ఏరిగేరి బదినేహాల్ మీదుగా రౌడూరు వరకు బస్సు సర్వీస్ నడపాలని ఆయన డిమాండ్ చేశారు. మండల కన్వీనర్ ఈరన్న, నాయకులు ఉలిగయ్య, వీరయ్యస్వామి, వన్నూర్‌లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హాలహర్వి: మండలంలోని చింతకుంట గ్రామ శివారులో పంప్‌హౌస్ వద్ద పోలీసులు సోమవారం కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నరేంద్ర తెలిపిన వివరాలు.. కర్ణాటక మద్యం తరలుతోందని వచ్చిన పక్కా సమాచారంతో పోలీసులు సోదాలు చేపట్టారు. ఆలూరు మండలం పెద్దహోతూరుకు చెందిన గొల్ల రాజశేఖర్ బైక్‌పై కర్ణాటక మద్యం తరలిస్తూ దొరికిపోయాడు. రాజశేఖర్ నుంచి ఆరు బాక్సుల 90 ఎంఎల్ ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు, బైక్ స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. సోదాల్లో పోలీసు కానిస్టేబుళ్లు రాజశేఖర్, విజయ్ పాల్గొన్నారు.

నాటు సారా బట్టీ ధ్వంసం

కోడుమూరు రూరల్: వెల్దుర్తి మండలం ఎల్.బండ తండాలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటుసారా బట్టీపై సిబ్బందితో దాడి చేసి 1,650 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు, 15 లీటర్ల నాటుసారాను సీజ్ చేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు సోమవారం తెలిపారు. నాటుసారా బట్టీ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు. దాడుల్లో డీటీఎఫ్ స్క్వాడ్ సీఐ నరసనాయుడు, సిబ్బంది శంకర్‌నాయక్, గోపాల్ నాయక్, వెంకట్రాముడు, కరుణాకర్, షేక్షావలి పాల్గొన్నారు.